రెసిడెన్షియల్ స్కూల్స్, గురుకుల పాఠశాలల గురించి కూడా రామచంద్ర రావు గారు ప్రస్తావించారు. దేశంలోని వివిధ మైనారిటీ కమ్యూనిటీల స్థితిగతులను పరిశీలించేందుకు కేంద్ర ప్రభుత్వం గతంలో సచార్ కమిటీ, రంగనాథ్ మిశ్రా వంటి కొన్ని కమిటీలను వేసింది. ముస్లిమ్స్ దళితులకన్నా అధ్వాన్న పరిస్థితుల్లో ఉన్నారని వాళ్ళ కమిటీల రిపోర్టు ఇచ్చింది. అందుకు అనేక కారణాలున్నప్పటికీ, ఆ పరిస్థితికి ప్రధానమైన కారణం వారు విద్యాపరంగా వెనకబడి ఉండడమే అని ఆ రిపోర్టుల్లో స్పష్టంగా చెప్పడం జరిగింది. అంటువంటి పరిస్థితుల్లో, కేవలం ముస్లిమ్స్‌కే కాకుండా ఎస్సీలకు, ఎస్టీలకు అందరికీ ప్రతి కులానికీ గురుకులాలు పెడితే వచ్చిన ఇబ్బందేముంది? నాకైతే అర్థమవడం లేదు. ఈ విషయంలో విభజన అనే మాటను నేను అంగీకరించను. ఈ రాష్ట్ర ప్రభుత్వం చేపడుతున్న సంక్షేమ పథకాలను కార్యక్రమాలను చాలా మంది స్వాగతిస్తున్నారు. ఒక అబ్బాయి పైన, ఒక అమ్మాయి పైన దాదాపు లక్ష రూపాయలు ఖర్చు చేసి విద్యనందిస్తున్న రాష్ట్రం మన రాష్ట్రం తప్ప దేశంలో మరే రాష్ట్రం లేదు. దానికి మేమందరం అంగీకరిస్తున్నాం. మిగిలిన వాటికి మన ఆర్థిక మంత్రివర్యులు సమాధానమిస్తారు. వారు సమర్థవంతులు. నాకు అవకాశమిచ్చినందుకు తమరికి మరొక్కసారి ధన్యవాదాలు తెలుపుతున్నాను. జై తెలంగాణ.

**మిస్టర్ ఛైర్మన్‌:–** జరిగిన చర్చపై ఆర్థిక శాఖా మాత్యులును సమాధానమివ్వవలసిందిగా కోరుతున్నాను.

**శ్రీ ఈటల రాజేందర్‌:–** అధ్యక్షా, అప్రాప్రియేషన్ బిల్లుపైన గౌరవ సభ్యులు రామచంద్ర రావు గారు, పల్లా రాజేశ్వర రెడ్డి గారు, జాఫ్రీ గారు, భాను ప్రసాద రావు గారు, జనార్థన్ రెడ్డి గారు, ఫారూక్ హుస్సేన్ గారు, యాదవ రెడ్డి గారు, పెద్దలు ఫరీదుద్దీన్ గారు చర్చలో పాల్గొనడం జరిగింది.

సభ్యులు రామచంద్రరావు గారు విద్యావేత్త కాబట్టి, వారు విద్య మీద ఎక్కువ ఫోకస్ చేశారు. వారు ఏదైతే అంశాన్ని చెప్పారో, మన ఉద్యమ నాయకులైన కెసిఆర్ గారు ఉద్యమ కాలంలో అనేక సార్లు ఆ మాటే చెప్పారు. మీరూ, మేమూ అనేక సార్లు వారి నోటి నుండి విన్న ఆ మాట ఏమిటంటే, "నా ఊర్లో నేనున్నా, ఇంకొక వ్యక్తి ఉన్నాడు. నేను కాస్త ఉన్న వాడిని కాబట్టి, నా కొడుకును చదివించుకోగలిగాను. నా కొడుకు చదువుకొని ఎంతో గొప్పగా ఎదిగాడు. కానీ, నాతోపాటు వ్యవసాయం చేసినటువంటి ఫలానా మల్లయ్య గారి కొడుకు చదువుకోకపోవడం వల్ల ఇవ్వాళ్టికీ ఆయన జీవితం గట్లే ఉన్నది". ఈ మాట చెప్పి తక్కున వారనే మాట ఏమిటంటే, విద్య మీద పెట్టేటువంటి ఖర్చు అని ప్రభుత్వం చెబుతున్న మాట ఏదైతే ఉందో, దానిని ఖర్చులాగా కాకుండా ఇన్వెస్ట్‌మెంట్ లాగా భావించేటువంటి కల్చర్ రావాలని ఆరోజే వారు చెప్పారు.

ఆ ఆలోచన నుంచే వచ్చిన కార్యక్రమమే 'కెజి టు పిజి విద్య' కార్యక్రమం. ఈ కార్యక్రమాన్ని చేపట్టడమే అంతిమ పరిష్కారంగా వారు భావించారు కాబట్టే, దాన్ని బాజప్తా మ్యానిఫెస్టోలో మేము పెట్టుకున్నాం. 2004వ సంవత్సరంలో నాతోపాటుగా నాయిని నరసింహారెడ్డి గారు కూడా సభలో ఉన్నారు. ఆరోజు వారు మంత్రిగా ఉన్నారు. నేను కొత్తగా ఎమ్మెల్యేగా ఎన్నికై ఆరోజు సభలోకి వచ్చాను. ఆ రోజు అబ్దుల్ కలాం గారు వచ్చి జాయింట్ సెషన్‌ను అడ్రస్ చేసినటువంటి సభలో కొత్త ఎమ్మెల్యేగా నేను ఉండగలగడం, నాకు చాలా గొప్ప భాగ్యం. అనేక రకాల ఊహాగానాలు, అనేక రకాల ఆలోచనలు మదిలో ఘర్షిస్తున్న సందర్భమది. వారు మాట్లాడిన తరువాత, వారు ఒక అప్పీల్ చేశారు. మీకు ఏమైనా డౌట్స్ ఉన్నా, మీరు నాకేమైనా సూచనలివ్వాలన్నా, లేదూ మీ ఆలోచనల మీద నా అభిప్రాయం తెలుసుకోవాలనుకున్నా ఒక చిట్టీ మీద రాసి పంపాలని కోరారు. నేను కూడా ఒక చిట్టీ పైన అబ్దుల్ కలాం గారికి రాసి పంపించాను. అయ్యా, మీరు దేశ ప్రథమ పౌరులు. ఈ దేశాన్ని పట్టి పీడిస్తున్న కులతత్వం, మతతత్వం, ఆశ్రిత పక్షపాతం, లంచగొండితనం, అన్నింటికీ మిక్కిలిగా అసమానతలు అంతం కావాలంటే మీరు ఏమి జవాబు చెప్తారని అడిగాను. ఆ సభలో మన చారి గారు కూడా ఉన్నారు. మా ఫరీదుద్దీన్ భాయ్ అప్పుడు మంత్రిగా ఉండి ఉండొచ్చు. అబ్దుల్ కలాం గారు అప్పుడు ఉపన్యాసం ఇవ్వలేదు. వారు "An Elementary Teacher and a parent can eradicate all those things." అని ఒక్కటే మాటను చెప్పిన మహనీయుడు, డా.ఎ.పి.జె. అబ్దుల్ కలాం గారు.

(బల్లలు చరచడం ద్వారా సభ్యులు తమ హర్షాన్ని వ్యక్తపరిచారు)

అంటే, విద్య అనేది దేశ అభివృద్ధిలో ఎంత గొప్ప పనిముట్టు అనేది వారు చెప్పిన మాటను బట్టి మనకు అర్థమవుతుంది. కొఠారి గారు చెప్పినా, అబ్దుల్ కలాం గారు చెప్పినా, కెసిఆర్ గారు చెప్పినా, మీరు ఇవాళ మాట్లాడినా, తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం యొక్క మొట్టమొదటి ప్రయారిటీ, అంతిమ తెలంగాణ లక్ష్యమైన బంగారు తెలంగాణ సాధన కోసం ముఖ్య సాధనం 'విద్య' అని గుర్తించిన ప్రభుత్వం మన ప్రభుత్వమేనని,

దానికోసం పునాది వేసుకున్న ప్రభుత్వం మనదేనని తమరి ద్వారా సభ్యులకు విజ్ఞప్తి చేస్తున్నాను.

అధ్యక్షా, రామచంద్ర రావు గారు మాట్లాడుతూ విశ్వవిద్యాలయాలలో నియామకాలు లేవని ఆరోపించారు. మా ప్రభుత్వం ఎంత కమిట్‌మెంట్‌తో పనిచేస్తోందో చెప్పడానికి, రూ.18030/- గా ఉన్న జూనియర్ లెక్చరర్ల వేతనాలను రూ.37,100/- కు పెంచాం. మనం వేతనాలను దేనికోసం పెంచుకున్నామో ఒకసారి అర్థం చేసుకోవాలి. పాలిటెక్నిక్ లెక్చరర్లకు రూ.19,050/-గా ఉన్న వేతనాలను రూ.40,270/- కు పెంచాం. డిగ్రీ కాలేజ్ లెక్చరర్లకు రూ.20,680/- లుగా ఉన్న వేతనాలను రూ.40,270/- కు పెంచాం. పార్ట్ టైమ్ లెక్చరర్లకు గంటకు రూ.300/- లుంటే, దానిని నెలకు రూ.21,600/- లు చేసుకున్నాం. పార్ట్‌టైమ్ లెక్చరర్లలోనే కొందరికి రూ.37,100/- లు ప్లస్ డి.ఏ.తో పాటు మిగతా భత్యాలను కూడా కలిపి ఇచ్చిన ప్రభుత్వం కూడా మన తెలంగాణ ప్రభుత్వమే.

ఆనాడు, ఉద్యమ నాయకుడిగా ఉన్న కెసిఆర్ గారు ఒక మాట అన్నారు. కనీస వేతన చట్టాన్ని అమలు చేసేది ప్రభుత్వమే అయినప్పుడు, అమలు చేయించేది కూడా ప్రభుత్వమే అయినప్పుడు, కనీస వేతన చట్టాన్ని కూడా అమలు చేయనటువంటి దుర్మార్గులు ప్రభుత్వాన్ని పాలిస్తే, ఇంక అర్థమేముంటుందని ఆనాడు ఉద్యమ సమయంలో చెప్పినవారు కాబట్టి, ఇవాళ విద్య మీద ఇంత ఫోకస్డ్‌గా ఉన్నారు కాబట్టే, ఇవన్నీ కూడా పెంచారు. వాటితో పాటు హార్టికల్చర్, అగ్రికల్చర్ విశ్వ విద్యాలయాలతోపాటు అన్ని విశ్వ విద్యాలయాలలో ఎన్ని ఖాళీలున్నాయో, వాటన్నింటినీ కూడా భర్తీ చేయమని ఇప్పటికే మంజూరు ఇచ్చి, ఏ సంస్థకు ఆ సంస్థ స్వయంగా భర్తీ చేసుకునేందుకు కూడా ఆదేశాలు జారీ చేయడం జరిగిందని తమరి ద్వారా సభకు తెలియజేస్తున్నాను.

సభ్యులు రామచంద్రరావు గారు మాట్లాడుతూ, మా పార్టీ దేశాన్ని పాలిస్తున్న పార్టీ అని చెప్పారు. ఎస్, వాళ్ల పార్టీ దేశాన్ని పాలిస్తున్న పార్టీనే. 21 రాష్ట్రాలలో పరిపాలన చేస్తున్న ఏకైక అతి పెద్ద పార్టీ మీదే కావచ్చు. అలాంటి ప్రభుత్వం కేంద్రంలో అధికారంలోకి వచ్చిన నాడు, మన ప్రాంతంతో పాటు దేశ వ్యాప్తంగా అనేక రాష్ట్రాలలో అనేక జిల్లాలలో అనేక మోడల్ స్కూళ్ళను ప్రారంభించారు. ఆ మోడల్ స్కూళ్ళు జవహర్ నవోదయ విద్యాలయ కంటే కూడా గొప్పగా ఉండబోతు న్నాయని ప్రచారం చేశారు. అందరూ నిజమే అనుకుని సంబరపడి, వాటిని కూడా జవహర్ నవోదయ విద్యాలయాల వలె అనుకొని, కొన్ని వేల దరఖాస్తులు చేసుకున్నారు. ఎస్సీ రెసిడెన్షియల్ స్కూళ్ళలో చదువుకునేవారు, ఎస్టీ రెసిడెన్షియల్ స్కూళ్ళలో చదువుకునేవారు, బిసీ రెసిడెన్షియల్ స్కూళ్ళలో చదువుకునేవారు ఇతరత్రా స్కూళ్ళలో చదువుకునే అనేక మంది విద్యార్థులు దరఖాస్తులు పెట్టుకొని, ఈ మోడల్ స్కూళ్ళలో చేరారు.

ప్రచార పటాటోపాలు అంటారు. ఆ విధంగా ప్రచారం చేసి, తదుపరి మన ప్రధాన మంత్రి గారి ఒక్కటే సంతకంతో ఆ మోడల్ స్కూల్ వ్యవస్థకు ఫుల్‌స్టాప్ పెట్టిన ప్రభుత్వం, కేంద్ర ప్రభుత్వం. కాబట్టి, ఈ ప్రభుత్వం ప్రోగ్రెసివ్ మ్యానర్‌లో నడుస్తోందా, రిగ్రెసివ్ మ్యానర్‌లో నడుస్తోందా అని నేను ప్రత్యేకంగా చెప్పనవసరం లేదు. మొన్నటి సమావేశాలలో కూడా చెప్పాను. ఇప్పుడు కూడా చెప్పదలచుకున్నాను. విద్య పట్ల మీకు అంకిత భావం లేదు. విద్యపట్ల అవగాహన లేదు. విద్యను ప్రోత్సహించాలనే సంకల్పం లేదు. పోనీ, ఆరోగ్యానికిస్తారా? ఆరోగ్య విషయంలో కూడా, అంగన్‌వాడీ కేంద్రాలలో గరీబు మహిళల కోసం, గరీబు పిల్లలకు పౌష్టికాహారం కొరకు గత బడ్జెట్‌లో రూ.17,800/- కోట్లు కేటాయిస్తే, పెరిగిన బడ్జెట్ ప్రకారంగా ఇంకా కొంత పెంచుకొని బడ్జెట్ పెట్టుకోవాలనే భావన ఉండాలి గానీ, కేంద్ర ప్రభుత్వం దానిని రూ.10,000/- కోట్లకు తగ్గించుకుంది. తరువాత మేము రెసిస్ట్ చేస్తే సర్దుకున్నారు. దయచేసి ఆలోచన చేయండి. ఇది ప్రోగ్రెసివ్ స్టెప్పా? రిగ్రెసివ్ స్టెప్పా? అనేది సభ్యులు రామచంద్ర రావు గారు ఆలోచించుకోవాలి. మీరు చేస్తున్నటువంటి సూచనలు, సలహాలు ఆచరణలో అమలు చేస్తున్నటువంటి మాకు ఇవ్వడం కంటే కూడా మాటలు చెప్పి, ఆచరణలో అమలు చేయనటువంటి వాళ్ళకు మీ సూచనలు, సలహాలిస్తే ఈ దేశం బాగుపడుతుందని మనవి చేస్తున్నాను.

అధ్యక్షా, 'ముంజేతి కంకణానికి అద్దమేల' అంటారు. సభ్యులు రామచంద్రరావు గారు విద్యావంతులు కాబట్టి, ఈ ప్రభుత్వం పనిచేసే ప్రభుత్వమా? కాదా? ఈ ప్రభుత్వ పని తీరు ఎలా ఉందో తెలపడానికి ఎన్ని గంటలు చెప్పాలి? ఎన్ని రోజులు చెప్పాలి? మీరు ఎక్కడికి వెళ్ళినా కూడా, తెలంగాణ పల్లెలలోని ఏ పల్లెకైనా వెళ్ళండి, ఏ తెలంగాణ పల్లెల్లోని ఏ కులంలో ఉన్నటువంటి వ్యక్తినైనా కదిలించండి, ఈ ప్రభుత్వం పనిచేసేదా? కాదా? అనేటువంటిది అర్థమవుతుంది. ఈ ప్రభుత్వం ఎప్పుడూ ఎక్కువ, తక్కువల గురించి చెప్పుకోదు.

'అల్పుడెపుడు పలుకు ఆడంబరముగాను, సజ్జనుండు పలుకు చల్లగాను' అంటారు. అధ్యక్షా, మేము అల్పమెప్పుడూ చెప్పం, మాట్లాడం. ప్రచారం చేసుకునే వాళ్ళెవరో? ఆ ప్రచారంలో భాగంగా దేశంలో పరిపాలనలోకి వచ్చిన వాళ్ళెవరో? వచ్చిన తరువాత అనేక సందర్భాలలో ఏమి జరిగిందో మేము చెప్పనక్కర లేదు. మీరు మాట్లాడిన మాట మాకు అప్లై కాదు. మీరు మాట్లాడిన మాట కేంద్ర ప్రభుత్వానికి వర్తిస్తుంది. కేంద్రంలో ఉన్న ప్రధాన మంత్రి గారికి వర్తిస్తుంది తప్ప, మాకు వర్తించదని తెలియజేస్తున్నాను.

అధ్యక్షా, సభ్యులు జాఫ్రీ గారు మాట్లాడుతూ, మీరు అనేకసార్లు ఈ సప్లిమెంటరీ ఎస్టిమేట్స్ ఏంటి? కథేంటి? కార్ఖానా ఏంటి? అని అడిగారు. మేము అనేక సార్లు చెప్పాం. మేము అనుకున్నాం. బడ్జెట్ పెట్టుకున్నాం. మార్గ మధ్యంలో కొన్ని కొత్త స్కీములు వస్తాయి. కొన్ని కొత్త అవసరాలు పడతాయి. వాటి కోసం మనం బడ్జెట్‌ను మార్చుకోవలసిన అవసరముంది కాబట్టి, మార్చుకున్నాం తప్ప, అంతిమంగా తెలంగాణ రాష్ట్రప్రభుత్వం ప్రజల కోణంలో, ప్రజల అవసరాల కోసం మార్చు కుంటున్నారా? లేదా? అనేదే ఇంపార్టెంట్ తప్ప, దానిని ఇంకొక కోణంలో చూడనక్కర లేదు. మనం, బడ్జెట్ ఎస్టిమేట్‌లు, బడ్జెట్ ఎక్స్‌పెండిచర్లు వంటివన్నీ కూడా వెనకటిలాగా రొటీన్‌గా ఉండాలనేటువంటి కాన్సెప్ట్ కాకుండా, మారిన పరిస్థితులకు అనుగుణంగా ఎప్పటికప్పుడు మార్చుకుంటూనే ముందుకు పోవాలి తప్ప, జడపదార్థంగా ఉండనక్కర లేదు. ఇంకా వెనకటి లాగానే దాన్నే పట్టుకుని వేలాడక్కర లేదని విజ్ఞప్తి చేస్తున్నాను.

ఇవాళ సప్లిమెంటరీ బడ్జెట్స్ గానీ, ఆ ఎస్టిమేట్స్ గానీ, ఆ ప్రపోజల్ గానీ, వాటికి సంబంధించి కాగ్ ఉంటుంది. వాళ్ళు తప్పకుండా చూస్తారు. ఆ కాగ్ రిపోర్టు కూడా పి.ఏ.సి. కమిటీ ముందుకు వస్తుంది. మన సభ్యులకు చర్చించేందుకు అవకాశం వస్తుంది. వీటిని కూడా బడ్జెట్ రూపంలో ఆ ఎక్స్‌పెండిచర్ ఏంటి? ఖర్చేంది? దేని కొరకు మార్చబడ్డదో తప్పకుండా సభలో కూడా తెలియపరుస్తామని మనవి చేస్తున్నాను.

**5.00 సా.** అధ్యక్షా, రెండవ మాట, అప్పులు చేస్తున్నారనే ఒక భావన ఉన్నది. ఇంతకుముందు గౌరవ సభ్యులు శ్రీ కొంపల్లి యాదవరెడ్డి గారు సదరన్ స్టేట్స్ అండ్ నార్తరన్ స్టేట్స్ విషయంలో వారు క్లారిఫై చేయడం జరిగింది. కానీ, శ్రీ ఎన్. రామచంద్ర రావు గారు విద్యావేత్తలు కాబట్టి, గౌరవ ఛైర్మన్ గారి ద్వారా ఒక మాట అడగాలని అనుకుంటున్నాను. మొన్ననే శ్రీ ఎం.కె. సింగ్ గారి ఆధ్వర్యంలో 15వ ఆర్థిక సంఘం ఏర్పాటు చేశారు. ఆ 15వ ఫైనాన్స్ కమీషన్ విషయంలో ఇప్పటికే మూడు, నాలుగు విషయాలు బయటకు వచ్చాయి. అవి ఎంతవరకు నిజమో తెలియదు. కానీ, 42శాతం Tax Devolution ఏదైతే పంపకం జరుగుతుందో దానిని సమీక్షించుకునే ఆస్కారం ఉందనేది ఒక మాట. మరీ ఇది నిజమా, అబద్ధమా తెలియాలి. ఒకవేళ సమీక్షించుకుంటామంటే అది ప్రోగ్రెసీవ్ పద్ధతిలో ఉంటే హర్షిస్తారు తప్ప, అది రెగ్రెసీవ్ పద్ధతిలో ఉంటే మాత్రం తప్పకుండా గౌరవ సభ్యులు యాదవరెడ్డి గారు చెప్పినటువంటి సంఘటనలు పునరావృతం అయ్యేటటువంటి ఆస్కారం ఉంటుంది.

మరొకటి ఏమిటంటే, గౌరవ ముఖ్యమంత్రి గారు ఇప్పటికే చెప్పారు, నేను కూడా అనేకమార్లు చెప్పాను. దేశానికి ఒక న్యాయం, రాష్ట్రాలకు ఒక న్యాయం ఉండవద్దు. దేశానికైనా, రాష్ట్రానికైనా ఒకే న్యాయం ఉండాలి. జిఎస్‌డిపిలో 49.5శాతం అప్పులు తెచ్చుకునే ఆస్కారం దేశానికి ఉన్నప్పుడు, ఇప్పటికే రాష్ట్రాలకు జిఎస్‌డిపిలో 25శాతం లోపు మాత్రమే అప్పులు తెచ్చుకునే నిబంధన ఉన్నది. కానీ, ఇప్పుడు శ్రీ ఎం.కె.సింగ్ గారి ఆధ్వర్యంలో ఏర్పడినటువంటి 15వ ఫైనాన్స్ కమీషన్ జిఎస్‌డిపిలో 25శాతం కాదు, 20శాతానికి లోబడే రాష్ట్రాలు అప్పులు తెచ్చుకునే నిబంధన పెట్టబోతున్నారనే ఒక మాట వినవస్తుంది. Is it fair? ఈరోజు, గీ కాలంలో, గీ చట్టం తెచ్చేటటువంటి ప్రభుత్వం అది ప్రోగ్రెసీవ్ ప్రభుత్వమా? రెగ్రెసీవ్ ప్రభుత్వమా అనేది గౌరవ సభ్యులు శ్రీ ఎన్. రామచంద్ర రావు గారు ఆలోచించుకోవాలని మీద్వారా కోరుతున్నాను. ఇప్పటికే తెలంగాణ లాంటి ఒక కొత్త రాష్ట్రం అనేక రకాలైన aspirationsతో ప్రజల అవసరాలు తీర్చాలని ఒక సంకల్ప బలం ఉన్నటువంటి రాష్ట్రం. 70 సంవత్సరాల తరువాతనైనా కనీస సౌకర్యాలకు నోచుకోకుండా, అన్నమో రామచంద్రా అంటూ బిక్కు, బిక్కుమంటూ కన్నీళ్లు కారుస్తూ చావులకు దగ్గరైనటువంటి కోట్లాదిమంది ప్రజానీకానికి పరిష్కారం చూపాలనే ఒక ఆలోచనతో అనేక రాష్ట్రాలు ఆలోచన చేస్తున్నాయి. ఆలోచన చేసినప్పుడు కేంద్ర ప్రభుత్వం తప్పకుండా పేద రాష్ట్రాలకు సపోర్టు చేయాలి, అండగా ఉండాలి. అది ఒక సామాజిక బాధ్యత. కానీ, ఒక కొత్త రాష్ట్రం, ఒక ప్రోగ్రెసీవ్ ఆలోచన ఉన్నటువంటి రాష్ట్రం ఇగో నా రాష్ట్రానికి ఇది చేయబోతున్నావని గనుక ముందుబడితే అది అవసరమైనప్పుడు, అది తప్పకుండా ఆచరణలో పెట్టాలనే సంకల్ప బలమున్నప్పుడు కేంద్రం కనీసం సపోర్టు చేసే

ప్రయత్నం చేయాలి. కానీ, అమ్మ పెట్టదు, అడుక్క తిననివ్వదు. నీవు ఇవ్వకుంటే ఇవ్వకపోతివి కానీ, కనీసం అప్పు తెచ్చుకోడానికైనా మీరు ఆస్కారం ఇవ్వకపోతే, ప్రధానమంత్రి మాట ఏదైతే

ریاستوں کی ترقی میں ہی ملک کی ترقی مضمر ہے۔

రాష్ట్రాల అభివృద్ధిలోనే దేశ అభివృద్ధి ముడిపడి ఉందని చెప్పే మాట ఏదైతే ఉందో అది నిజమే అయితే ఈవాళ్ల నీతి ఆయోగ్ ఏదైతే మిషన్ భగీరథ కోసం రూ.19,500కోట్లు, మిషన్ కాకతీయ కోసం రూ.5000కోట్లు సిఫారసు చేసినప్పటికీ, కనీసం ఒక రూ.500కోట్లు కూడా ఇవ్వలేదు. ఇదేనా రాష్ట్రాల అభివృద్ధిలో దేశ అభివృద్ధి ముడిపడి ఉందని చెప్పి చెప్పింది. ఒకసారి కేంద్ర ప్రభుత్వం ఆత్మ విమర్శ చేసుకోవాలని చెప్పి కోరుతున్నాను.

ఈ వేదిక ద్వారా కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తున్నాం. ఇంక మూడవది కూడా జరగబోతోందంట. అదేమంటే, 15వ ఆర్థిక సంఘం గతంలోని 1970 జనాభా ప్రాతిపదికపైనా మనకి ఈ టాక్స్ డెవల్యూషన్ వచ్చేది. నాకు తెలిసి ఆనాడు శ్రీమతి ఇందిరాగాంధీ గారు అనుకుంటా, ఆనాడు ఫ్యామిలీ ప్లానింగ్ అనేటటువంటి పథకాన్ని తెచ్చి అందరినీ దొరకబట్టి, దొరకబట్టి ఆపరేషన్ చేశారని చెప్పి మనం చిన్నప్పుడు వినేవారిమి. అంటే ఎందుకు దేశ జనాభా విపరీతంగా పెరిగిపోతోంది. unscientificగా ఉన్నది, నియంత్రించాల్సిన అక్కెర ఉన్నది. ఇదే ఒరవడి కొనసాగితే చివరికి అన్నం తినేటటువంటి పరిస్థితి లేదని చెప్పి ఆనాడు శ్రీమతి ఇందిరాగాంధీ గారు ఫ్యామిలీ ప్లానింగ్ పథకాన్ని తెచ్చారు. ఆ ఫ్యామిలీ ప్లానింగ్‌ని నిజమే అని చెప్పి నమ్మి, ఇది అవసరమని చెప్పి భావించి అమలు చేసిన ఏడు రాష్ట్రాలు ప్రొగ్రెసీవ్ రాష్ట్రాలా, అమలు చేయకుండా జనాభా పెరిగినటువంటి రాష్ట్రాలు ప్రొగ్రెసీవ్ రాష్ట్రాలా అనేది చెప్పాలని కోరుతున్నాను. 14 ఆర్థిక సంఘం 1970జనాభా ప్రాతిపదికపైనా మన వాటా all means IMR, MMR కావచ్చు, లిటరసీ కావచ్చు, పాపులేషన్ కావచ్చు, ఏరియా కావచ్చు, ఫారెస్ట్ కవరేజ్ కావచ్చు ఏ నార్మ్స్ ప్రకారం రాష్ట్రాలకు టాక్స్ డెవల్యూషన్ నిర్ణయించబడుతుందో ఆ నిర్ణయంలో 15 ఆర్థిక సంఘం 1970 కాదు, 2011 పాపులేషన్ ప్రకారంగా గనుక చేస్తామని పెడితే ఇవాళ్ల సదరన్ స్టేట్స్ నష్టపోయే ఆస్కారం ఉంది. 14 ఆర్థిక సంఘం మనకి, మన రాష్ట్రానికి, మన పారామీటర్స్ ప్రకారంగా 2.43శాతం ప్రకారంగా ఇవాళ్ల మనం బడ్జెట్‌లో ఏదైతే పెట్టుకున్నామో అందులో రూ.19,000కోట్లు వస్తాయని భావిస్తున్నాం. Centrally Sponsored Schemes, మనకు వచ్చేటటువంటి Tax Devolution వాళ్లేమి ఇవ్వరు కదా! ఇవాళ్ల గౌరవ ముఖ్యమంత్రి గారు చెప్పారు. రూ.50,000కోట్ల పైచిలుకు ఈ రాష్ట్ర ప్రజలు తమ చెమట పైసల్ని వ్యాపార రూపంలో కేంద్రానికి పంపిస్తూ ఉంటే, దాంట్లో కేంద్రం ప్రతి సంవత్సరం ఇచ్చేటటువంటి నిధులు 2014-15లో ట్యాక్స్ డెవల్యూషన్ ప్లస్ సిఎస్ఎస్ కలుపుకొని రూ.15,307కోట్లు, 2015-16లో రూ.21,429కోట్లు, 2016-17లో రూ.24,560కోట్లు, 2017-18లో ఇప్పటి వరకైతే రూ.20,067కోట్లు, మొత్తం కలిస్తే రూ.81,362కోట్లు.

గతంలో నేను ఇదే సభలోనో, ఆ సభలోనే చెప్పి ఉన్నాను. నేను అడుగుతున్నాను. రాష్ట్రం వేరు, కేంద్రం వేరు అనే సంకుచిత పద్ధతి మంచిది కాదు అని చెప్పాను. నా దృష్టిలో రాష్ట్రం వేరు, దేశం వేరు అని నేను భావించడం లేదు. నా తెలంగాణ పల్లెల్లో కుటుంబాలు బాగుంటే, ఆ గ్రామం బాగుంటుంది. ఆ గ్రామాలు బాగుంటే మా రాష్ట్రం బాగుంటుంది, ఈ రాష్ట్రం బాగుంటే దేశం బాగుంటుందని నేను భావిస్తున్నాను. తెలంగాణ పల్లెల్లో కన్నీళ్లు కారుస్తుంటే, తెలంగాణ పల్లెల్లో ఆకలి విలయతాండవం చేస్తూ ఉంటే, నేను బంగారు తెలంగాణ అని చెప్పి మాటలు మాట్లాడితే ఎవరైనా హర్షిస్తారా అధ్యక్షా? ఎస్, తప్పకుండా బీహార్‌లో కూడా పరిస్థితులు మారాలని మేము కోరుకుంటాం. North Eastern Statesలో కూడా పరిస్థితులు మారాలని మేము కోరుకుంటాం. యుపిలో కూడా తాండవిస్తున్న పేదరికం నిర్మూలన కావాలని చెప్పి కాంక్షిస్తాం. At the same time, ఏ రాష్ట్రాలైతే ప్రజల కోసం ఆలోచన చేస్తున్నాయో, ఏ రాష్ట్రాలైతే కమిట్‌మెంట్‌తో ఇగో నా రాష్ట్రంలో గీ సమస్య పరిష్కారం కావాలని చెప్పి తపన పడుతోందో, ఆ తపనపడే ప్రభుత్వాలకు కేంద్ర ప్రభుత్వం మద్దతు ఇవ్వాల్సిన కనీస ఇంగిత జ్ఞానం ఉండాలని చెప్పి నేను కోరుకుంటున్నాను. కేంద్రంలో ఈరోజు బిజెపి ఉండవచ్చు, రేపు కాంగ్రెస్ ఉండవచ్చు, రేపు ఇంకో ప్రభుత్వం ఉండవచ్చు. ఎవరున్నా కూడా ఆ కనీస భావన మాత్రం ఉండాలని చెప్పి నేను కోరుకుంటున్నాను. ఒకవేళ అట్లా ఉండకపోతే గౌరవ సభ్యులు శ్రీ కొంపల్లి యాదవరెడ్డి గారు చెప్పినట్లుగా తప్పకుండా ఈ అసమానతలు ఏవైతే ఉన్నాయో, ఈ అంతరాలు, ఈ వివక్ష ఏదైతే ఉందో అది రాబోయే కాలంలో National Integrityకే విఘాతం కలిగేటటువంటి పరిస్థితి ఉందని చెప్పి నేను భావిస్తున్నాను.

కానీ, at the same time తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ పరంగా దేశం సౌభాగ్యంగా ఉండాలని, సుభిక్షంగా, ఐక్యంగా ఉండాలని, ఈ దేశం ప్రపంచ చిత్రపటం మీద గౌరవంగా బ్రతికే పరిస్థితిలో ఉండాలని చెప్పి కోరుకుంటున్నాము. తప్ప, దానికి భిన్నమైన ఆలోచన ఈ ప్రభుత్వానికి ఉండదని చెప్పి నేను మనవి చేస్తున్నాను.

అప్పు తెచ్చి ఏమి చేస్తున్నాము అధ్యక్షా? క్యాపిటల్ ఎక్స్‌పెండీచర్ గురించి గౌరవ ముఖ్యమంత్రి గారు ఇక్కడనే నిలబడి చెప్పారు. రూ.1,29,000కోట్లు ఉమ్మడి రాష్ట్రంలో పది సంవత్సరాల్లో క్యాపిటల్ ఎక్స్‌పెండీచర్ అయితే, రూ.1,24,000కోట్లు నాలుగు సంవత్సరాల కాలంలో క్యాపిటల్ ఎక్స్‌పెండీచర్ క్రింద ఖర్చుపెడుతున్నామంటే, అస్సెట్స్ క్రియేట్ చేసుకోవడమంటే ఎంత కమిట్‌మెంట్ ఉండాలి, ఎంత దమ్ముండాలో ఒకసారి ఆలోచించుకోవాలి. ఇలాంటి ఆలోచనకి సపోర్టు చేయాలి. తప్ప, దానిని తుంచే, దానికి విఘాతం కలిగించే ప్రయత్నం చేయవద్దని నేను మనవి చేస్తున్నాను.

గౌరవ సభ్యులు శ్రీ ఎస్. రామచంద్ర రావు గారు మాట్లాడుతూ, ఇంకో మాట అన్నారు. రాష్ట్రానికి అనేకమంది అధికారులు వస్తున్నారని, అనేకమంది మంత్రులు వస్తున్నారని చెప్పి పోల్చారు. ఎవరి ఇంటికైనా భోజనానికి వెళితే బాగుందా అని అడిగితే, బాగుంటది అంటారు తప్ప, బాగలేకుండ ఉంటదా, బాగుండదని ముఖంమీద ఎవరు చెప్పరని ఆయన అన్నారు. సంతోషం అధ్యక్షా, గౌరవ సభ్యులు శ్రీ ఎన్. రామచంద్ర రావు గారు దానితో ఏకీభవిస్తున్నారా, ఆ మాట వారి అంతరంగం ప్రకారం అన్నారా, వారి గుండెల నుండి వచ్చిందా? బాధ అనిపియ్యదా అధ్యక్షా? ఇక్కడ ఉండి కొన్ని వందలసార్లు అంకెలు గురించి చెప్పాను. నేను అడుగుతున్నాను, 2013-14లో జిడిపిలో all India Growth Rate 5.9శాతం గ్రోత్ రేటు ఉంటే, ఆనాడు Telangana Growth Rate 4.2శాతం. ఇవాళ్ల కరెంట్ ప్రైసెస్‌లో all India Growth Rate 9.8%, Telangana Growth Rate 14.1%. ఈ లెక్కలు మేము ఇవ్వలేదు. ఈ లెక్కలు కేంద్ర ప్రభుత్వ ఆధీనంలో ఉన్నటువంటి సంస్థలు ఇచ్చేటివి. ప్రపంచంలో ఏ దేశమైనా కూడా, దేశంలో ఏ రాష్ట్రమైనా కూడా అభివృద్ధికి సూచిక ఏంటి? అభివృద్ధికి సూచిక పర్ క్యాపిటా ఇన్‌కం మరియు జిడిపి. ఈరోజు మన పర్ క్యాపిటా ఇన్‌కం 2017-18కు రూ.1,75,534/-. అదేరకంగా దేశ పర్‌క్యాపిటా ఇన్‌కం చూసుకుంటే, రూ.1,12,764/-లు. ఇది తిరోగమనమా, పురోగమనమా గౌరవ సభ్యులు శ్రీ ఎన్.రామచంద్ర రావు గారిలాంటి విజ్ఞులు చెప్పాలి.

అధ్యక్షా, మీరు మొన్న చూసి వచ్చిన కాళేశ్వరం ప్రాజెక్టే సజీవ సాక్ష్యం. వారు పొగడకుండా ఉండలేరు, అభినందించ కుండా ఆగలేదు వారి గుండె. గౌరవ మంత్రివర్యులు శ్రీ టి.హరీష్ రావు గారు మొన్ననే ఇదే సీట్లో మాట్లాడారు. నాగార్జున సాగర్ ఎస్టిమేషన్ నిధులెంత? పూర్తయ్యేనాటికి ఖర్చుపెట్టిన నిధులెన్ని, పోచంపాడు ప్రాజెక్ట్ ఎస్టిమేషన్ ఎంత? పూర్తయ్యేనాటికి అయినటువంటి ఖర్చు ఎంత? పోచంపాడు పునాది రాయి 1964లో వేస్తే, స్టేజ్-1, స్టేజ్-2 క్రింద 14లక్షల ఎకరాలకు నీళ్లు ఇవ్వాలంటే, ఈనాటికి కూడా లక్ష ఎకరాల్లో నీళ్లు పారలేదు. ఆ పంట కాలువల్లో తుమ్మలు, జిల్లేల్లు మొలిచాయని చెప్పి మా హరీష్ రావు గారు ఇక్కడనే నిలబడి చెప్పారు. అది చరిత్ర. కానీ మనం ఏమి చేస్తున్నాము? అధ్యక్షా, 2014 నుండి 2018వరకు 300పైచిలుకు అనుమతుల కొరకు ఒక ప్రభుత్వం తపనపడి, యజ్ఞం చేసి అవన్నీ సాధించి 2018కల్లా మిడ్‌మానేరుకు లింకప్ చేస్తాం. మొత్తం పూర్తిస్థాయిలో కాకపోవచ్చు, నీళ్లు మాత్రం తీసుకువచ్చి పోసేటటువంటి ఆస్కారం ఉందని ఇగో ఇదే సీటు వద్ద ప్రకటించినటువంటి వారు గౌరవ మంత్రివర్యులు శ్రీ టి.హరీష్‌రావు గారు. సాధ్యమైతదా, అధ్యక్షా ఒక్కగోదావరి మీద ఒక్క ప్రాజెక్టు నిర్మించడానికి పదుల సంవత్సరాలు పడితే ఇవాళ్ల అదే తెలంగాణ ప్రభుత్వం మూడు సంవత్సరాల కాలంలోనే ఆ ప్రాజెక్టులు పూర్తి చేసి ప్రజలకు అంకితం చేసే పరిస్థితి వచ్చిందంటే, మనం ఎటువైపు ప్రయాణం చేస్తున్నామనేది ఒకసారి ఆలోచన చేయాలి అధ్యక్షా.

ఈరోజు ఏ చైనా అయితే ఆదర్శవంతమని చెప్పుకుంటామో చైనాకంటే కూడా ఫాస్ట్‌గా సాగునీటి ప్రాజెక్టులు నిర్మించి రైతాంగానికి అంకితం చేస్తున్న ప్రభుత్వం తెలంగాణ రాష్ట్రప్రభుత్వమని నేను మనవి చేస్తున్నాను. అధ్యక్షా, మీకు తెలుసు, మనమందరం అప్పుడప్పుడు ఊర్లల్లోకి పోతూ ఉంటాం. వరంగల్ ఎంపి ఎన్నికలు వస్తే అక్కడి రెడ్డిపురం, రెడ్డిపాలెం అనే ఊర్లల్లోకి పోయాం. అక్కడ పిల్లలెవ్వరూ లేరు. ఊరంతా పాడుపడ్డట్లు ఉన్నది. ఏందీ అసలు అంతా ముసల్లోల్లు ఉన్నారని అడిగాను. అంటే, ఆనాడు మేము నల్లరేగడి భూములు ఎక్కడుంటే అక్కడికి వచ్చాం, ఆనాడు ప్రాజెక్టులు ఎక్కడ ప్రారంభిస్తే అక్కడికి వచ్చాం, అప్పుడు వచ్చి కష్టపడి పిల్లల్ని చదివించుకున్నాం, మా పిల్లల జనరేషన్ అంతా కూడా

అమెరికాలో ఉంటున్నారని చెప్పడం జరిగింది. ఈరోజు మాకు వ్యవసాయం irrelevant అని అన్నారు. అంటే, అధ్యక్షా, మనం కోస్తా, ఆంధ్ర ప్రాంతం గురించి మాట్లాడుకుంటాం. నీళ్లు-కొబ్బరితోటలు, నీళ్లు -చేపలు, నీళ్లు-రొయ్యలు, నీళ్లు-అరటితోటలు, నీళ్లు-పంటలు, అంతిమంగా వెల్త్.

جعفری صاحب میں اپیل کر رہا ہوں، آپ کو ایک بار غور کرنا چاہیے۔

మొన్నకూడా చెప్పాను, మళ్లీ ఇప్పుడు చెబుతున్నాను. 1863లో ఆనాడు నిజాం దగ్గరున్న ప్రధానమంత్రి రైల్వేకోసం లోన్ తీసుకున్నారు. సరోజిని నాయుడు గారి తండ్రి లోన్స్ తీసుకుంటారా, అప్పు తీసుకుంటారా అని ఆనాడు ఆయన ఉద్యమం చేశారు. కానీ, ఆనాడు ఆ అప్పు చేయకుండా ఉంటే, ఈరోజు మనం ఆ రైలు మార్గంలో పోయేవాళ్లమా అధ్యక్షా? ఒక కంపెనీ పెట్టాలి, ఒక ఇల్లు కట్టాలి, ఒక వ్యవస్థ ఏర్పాటు చేయాలి లోన్ తీసుకోకుండా సాధ్యం అవుతుందా? వందకు వంద శాతం పెట్టుబడి పెట్టి చేసేవాడు ప్రపంచంలో ఎక్కడ ఉండడు, ఉంటే బాగుపడడు. ఏవైనా చిన్న, చిన్నవి చేసుకోవచ్చు గానీ, పెద్ద వ్యాపారాలు మాత్రం చేయరు.

అట్లా తెలంగాణ రాష్ట్రం అప్పు చేస్తూ ఉంటే, మొదటిసారి చూస్తున్నా, గర్వంగా ప్రకటిస్తున్నాను. మీకు తెలుసో, తెలియదో, పది సంవత్సరాల వరకు లోన్స్ ఎవరూ ఇవ్వరూ. పన్నెండు సంవత్సరాలు ఇస్తే చాలా గొప్పగా ఉండే. కానీ, ఈరోజు తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం యొక్క ఆర్థిక అభివృద్ధిని చూసి ఎఫర్ట్స్‌ని చూసి, కమిట్‌మెంట్‌ను చూసి పని తనాన్ని చూసి 25 సంవత్సరాల వరకు అప్పులు పుడుతున్నటువంటి రాష్ట్రం తెలంగాణ రాష్ట్రం. ఇవ్వాళ్ల ఈ రాష్ట్రం ఒక లక్ష కోట్లు గనుక రుణం తీసుకుంటే ఆ లక్ష కోట్ల రూపాయలు మిషన్ భగీరథ మీద గానీ, సాగునీటి ప్రాజెక్టుల మీద పెట్టుబడిగా పెడితే 25 సంవత్సరాల తరువాత, 20 సంవత్సరాల తరువాత, 15 సంవత్సరాల తరువాత అసలు కట్టేదుంటుంది, దానికి వడ్డీ మాత్రం ప్రతి సంవత్సరం కట్టుకుంటూ పోయేదుంటుంది.

అధ్యక్షా, మీద్వారా గౌరవ సభ్యులు శ్రీ ఎస్. రామచంద్ర రావు గారిని అడుగుతున్నాను. ఒక 25 సంవత్సరాల తరువాత ఈ ప్రాజెక్టుల కాస్ట్ ఎంత ఉంటుందో వారు చెప్పగలరా? నాకు తెలిసి ప్రాణహిత-చేవెళ్ల కార్యక్రమాన్ని ప్రారంభించిన నాడు దాని ఎస్టిమేషన్స్ రూ.16,200కోట్లు. మా గౌరవ సభ్యులు శ్రీ టి.భానుప్రసాద రావు గారు అప్పుడు కాంగ్రెస్ పార్టీలో ఉండేవారు. శ్రీ వై.ఎస్. రాజశేఖర్ రెడ్డి గారు వచ్చి శ్రీపాద ఎల్లంపలి ప్రాజెక్ట్‌కు భూమి పూజ చేశారు. ఆనాడు దాని ఎస్టిమేషన్ రూ.735కోట్లు. దాని తరువాత రూ.1450కోట్లు అయింది. ఆ తరువాత రూ.4000కోట్లు అయినట్లు ఉందని ఏదో లెక్క చెప్పారు. ప్రతీ సంవత్సరం ఎస్.ఎస్.ఆర్. రేట్లు తగ్గుతాయా? పెరుగుతాయా? ఎంత పెరుగుతుంది. అసలు రూపీ డివాల్యుయేషన్ ఆర్థిక వేత్తలకు తెలుస్తుంది. నేను ఆర్థిక వేత్తను కాదు. డివాల్యూ కాదా అధ్యక్షా? మనమే అంటాం, రూ.150/- లకు తులం బంగారం కొంటిమి, అది కాస్త ఈరోజు రూ.30,000/- అయిపోయే అని అనుకుంటాం. ఎందుకు అధ్యక్షా, హైదరాబాద్‌లోనే ఒక ఎకరం కోటి రూపాయలకు కొంటే మళ్లీ ఐదేండ్ల తరువాత రెండు కోట్లో, మూడు కోట్లో, నాలుగు కోట్లో అవుతుంది.

అట్లా ఇవాళ్ల లక్ష రూపాయలు తీసుకువచ్చి, లక్షల, కోట్ల రూపాయల విలువైన అస్సెట్స్ క్రియేట్ చేసి తద్వారా కోటి ఎకరాలకు నీళ్లు అందించి ప్రజల బ్రతుకులు బాగు చేయడం ముఖ్యమా, అప్పెందుకు, సప్పెందుకు ఉన్నంతలో బ్రతుకుదామని గదే పూరి గుడిసలల్లో, గదే అర్థాకలితో, గదే కన్నీళ్లతో, గదే చదువు లేకుండా, గదే ఆరోగ్యం లేకండా బ్రతకడం ముఖ్యమా అని ఒకసారి ఆలోచన చేయాలని చెప్పి నేను కోరుతున్నాను. ఇంకోమాట, కేంద్ర ప్రభుత్వానికి కూడా సలహా ఇస్తున్నాను. నిన్ననే గౌరవ ముఖ్యమంత్రి గారు చెప్పారు. జపాన్ జిడిపిలో వారి లోన్స్ 200 శాతమని చెప్పారు. అదేవిధంగా అమెరికా లోన్స్ ఎంత అనే విషయాన్ని చెప్పారు. భారతదేశంలో కూడా 70సంవత్సరాల చరిత్రలో త్రాగేనీటికి నోచుకోకుండా, చదువుకు, ఆరోగ్యానికి నోచుకోకుండా ఇంకా మగ్గడం మన కర్తవ్యమా అని అడుగుతున్నాను. లేదు దేశాన్ని ఒక ప్రొగ్రెసీవ్ దేశంగా తీర్చిదిద్దడం ముఖ్యమా అనేది ఆలోచించుకోవాలని చెప్పి నేను కోరుతున్నాను.

నిరుద్యోగ సమస్య గురించి గౌరవ సభ్యులు శ్రీ ఎస్.రామచంద్ర రావు గారు అడిగారు. అవునూ నేనే వారిని అడుగుతున్నాను. అవునూ, సంవత్సరానికి రెండు కోట్ల ఉద్యోగాలు క్రియేట్ చేస్తామని చెప్పినటువంటి వ్యక్తి ఎవరు అధ్యక్షా, ఈ దేశంలో ఈ దేశాన్ని పాలిస్తున్న ప్రధానమంత్రి శ్రీ నరేంద్ర మోదీ గారు. మీకు తెలుసు ఆనాడు దేశంలో ఉన్నటువంటి మొత్తం యువత, దేశంలో ఉన్నటువంటి విద్యార్థులు, మేధావులు, రెండు విషయాలే ఆశించారు. ఈ దేశంలో కరప్షన్‌ని పోగొట్టాలంటే, మోదీ గారు రావాలని ఆశించారు. ఈ దేశంలో పేదరికం పోవాలంటే మోదీగారు

రావాలని ఆశించారు. ఈ దేశంలోని యువకులకు ఉద్యోగాలు రావాలంటే మోదీ గారు రావాలని కోరుకున్నారు. ఎవరికి వారు వాట్సప్‌లల్లో, సెల్‌ఫోన్‌లల్లో బ్రహ్మాండంగా ప్రచారం చేసుకున్నారు, గెలిపించుకున్నారు.

మన రాష్ట్రంలో 30,000 ఉద్యోగాలు ఇప్పటికే ఇవ్వగలిగాము. రెండు లక్షల పైచిలుకు ఉద్యోగుల జీతభత్యాలు పెంచగలిగాము. వెట్టి చాకిరి నుండి విముక్తి చేయగలిగాము. ఇంకా 50,000 ఉద్యోగాలు పైప్‌లైన్‌లో ఉన్నాయని చెప్పగలుగుతున్నాం. ఇంకో 40,000 ఉద్యోగాలు వచ్చే సంవత్సరం లోగా పూర్తి చేస్తామని బాజాప్తా బడ్జెట్‌లో పెట్టుకున్నాం. ఇవాళ్ల మాకు చెప్పుకోవడానికి ఒక కార్యక్రమం ఉన్నది. భారతీయ జనతా పార్టీని, కేంద్ర ప్రభుత్వాన్ని నేను అడుగుతున్నాను. కేంద్రంలో బిజెపి ప్రభుత్వం వచ్చిన తరువాత ఎన్ని కోట్ల ఉద్యోగాలు క్రియేట్ చేయబడ్డాయని అడుగుతున్నాను.

**5.20 సా.** జిఎస్‌టి వచ్చింది, ఇది ఒక ప్రోగ్రెసివ్ స్టెప్. డీమానిటైజేషన్, నల్ల ధనాన్ని బయటికి తీసుకు వచ్చే ఒక ప్రోగ్రెసివ్ స్టెప్. మేము కూడా సపోర్ట్ చేశాం. కానీ ఏమి జరిగింది? జిడిపి పెరిగిందా? ఉద్యోగాలు పెరిగాయా? ఎంతసేపు ప్రపంచవ్యాప్తంగా తిరుగుతూ బ్రహ్మాండంగా ఉపన్యాసాలు ఇచ్చారు తప్ప, చేసింది ఏమి లేదు. ఈ దేశంలో ఉద్యోగాలు పెరగలేదు, ఈ దేశంలో సంపద అనుకున్నంత స్థాయిలో పెరగలేదు. మీ లెక్కలే చెబుతున్నాయి. అన్నింటికి మించి ఇవ్వాళ అగ్రదేశమైన, ప్రపంచంలో భూతల స్వర్గం అని చెప్పే అమెరికా లాంటి దేశంలో మా దేశానికి బయటి వారు రావొద్దని, బోర్డు పెట్టే దౌర్భాగ్య పరిస్థితి ఇవ్వాళ మన అందరిని వేధిస్తున్న సమస్య.

బాగా చదువుకున్న ఉద్యోగాలకు ఇవ్వాళ అమెరికా అయితే, చదువు లేకుండా పొట్ట పోసుకోవడానికి పెట్టిన ఉద్యోగాలు గల్ఫ్ దేశంలో ఉన్న ఉద్యోగాలు. ఈనాడు గల్ఫ్ దేశాలకు వెళ్లిన మనవాళ్లు శవాలుగా తిరిగి వస్తున్నారు అధ్యక్షా. అమెరికాకు వెళ్లడం లేదు అధ్యక్షా, ఇక్కడే ఉంటున్నారు. ప్రపంచవ్యాప్తంగా, దేశవ్యాప్తంగా ఇటువంటి ప్రతికూల పరిస్థితులు ఉన్నప్పటికీ కూడా తెలంగాణ తన కాళ్ల మీద నిలబడి, తన సంపదను పెంచుకుంటుందంటేనే, తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం యొక్క ఆలోచన, తెలంగాణ ప్రభుత్వం ఈ రాష్ట్రానికి వేస్తున్న పునాది ఎట్లా ఉందో ఒకసారి ఆలోచన చేసుకోమని గౌరవ సభ్యులను కోరుతున్నాను.

వారు గుడ్డిగా ద్వేషించడం, విమర్శించడం అనే పద్ధతిలో కాకుండా, వాస్తవాలను చూడాలి. తెలంగాణ రాష్ట్రం వచ్చిన నాటికి 2,500 కిలో మీటర్ల నేషనల్ హైవేస్ ఉంటే, రాష్ట్రం ఏర్పడిన తర్వాత దాదాపు 3,200 కిలోమీటర్లు నేషనల్ హైవేస్ తెచ్చుకోవడం జరిగింది. అంటే నేషనల్ హైవేస్ మన రాష్ట్రంలో 2.5 శాతంగా ఉంటే, దానిని 4.9 శాతానికి, నేషనల్ యావరేజ్ కంటే ఎక్కువగా పెంచుకోవడం జరిగింది. అందుకు కేంద్ర ప్రభుత్వానికి, మన కేంద్ర ఉపరితల రవాణా శాఖా మంత్రి నితిన్ గడ్కరీ గారికి ధన్యవాదాలు తెలియజేశాం. అదీ మా సంస్కారం.

ఇవ్వాళ విద్య, విద్య అని వారంటున్నారు, నేను వారికి సూచన చేస్తున్నాను. ఎవరి పెన్షన్స్ అధ్యక్షా? మెస్ ఛార్జీల విషయంలో ఆనాడు నేను ఎంఎల్ఏగా, మా ఫారూక్ భాయ్ మంత్రిగా ఉన్నప్పుడు రాజశేఖర్ రెడ్డి గారు ముఖ్యమంత్రిగా ఉన్నారు. నేను హాస్టల్స్‌లో చదువుకున్న బిడ్డను కాబట్టి అడిగాను. నేను క్యాంపస్‌లో ఉన్నప్పుడు బాజాప్త బ్రహ్మాండంగా మధ్యాహ్నం పూట నాలుగో, ఐదో ముక్కలతో మటన్, గురువారం నాల్గోవ వంతు చికెన్, ఆదివారం ఆఫ్ చికెన్, శనివారం గుడ్డు ఉండేవి. నాలాంటి పేదవాడు ఒక్క సింగిల్ పైసా కూడా ఇంటి దగ్గర నుండి తెచ్చుకునే అక్కర లేకుండేది. మెస్ బిల్లులు మొత్తం ప్రభుత్వమే, రూ.25/-లు పాకెట్ మనీ ఉండేది. వచ్చిందా లేదా చెప్పండి. పుస్తకాలు ఫ్రీ, బట్టలు ఫ్రీ, బువ్వ ఫ్రీ, బస్‌పాస్ నాలుగు రూపాయిలో, ఐదు రూపాయిలో ఉండేది.

ఆనాటి ముఖ్యమంత్రితో నేను అన్నాను, అయ్యా! రాజశేఖర్ రెడ్డి గారు మీరు శాతాల జోలికి పోకండి, మీరు కూడా మెడికల్ కాలేజిలో చదువుకున్నారు, మేము క్యాంపస్‌లో చదువుకున్నాం, మాకు ఈ తిండి పెట్టారు. ఒకవేళ మనం అభివృద్ధి వైపు ప్రయాణం చేస్తే, ఎందుకు ఇవ్వాళ మా మటన్ మాయమైపోయింది? ఎందుకు మా క్వార్టర్ చికెన్ మాయమైపోయింది? ఎందుకు మా ఆఫ్ చికెన్ మాయమైపోయింది? ఎంత పెంచుతారో మాకు తెలియదు గాని మేము 30 ఏళ్ల క్రితం తిన్న బువ్వను మాత్రం మాకు పెడతారా? లేదా? అని అడిగితే, ఏమయ్యా వ్యంగ్యంగా మాట్లాడుతున్నావని అన్నారు. వ్యంగ్యంగా కాదు సార్, ఆవేదనతో, ఆకలి అనుభవించిన బిడ్డగా నేను వేస్తున్న ప్రశ్న ఇది. దయచేసి మీరు పెంచండి అని అడిగితే, పైసలు ఎక్కడి నుండి తేవాలని అన్నారు. ఆ డబ్బు విషయంలో కూడా ఒక మార్గాన్ని చెప్పాను రామచంద్ర రావు గారూ. మనసుంటే మార్గం

ఉంటుందని నేను చెప్పాను కానీ, శాతాల జోలికి పోలేదు. పెంచింది ఎంత? 25 శాతమో, 30 శాతమో పెంచారు.

ఈరోజు 70 శాతం నుండి 120 శాతం డైట్ చార్జీలు పెంచిన రాష్ట్రం తెలంగాణ రాష్ట్రమని ఈ సందర్భంగా చెబుతున్నాను. గుమ్మిలో వడ్లు గుమ్మిలోనే ఉండాలి, బిడ్డలు మాత్రం గొప్పగా ఉండాలంటే సాధ్యమవుతుందా అధ్యక్షా? వారు అన్ని కార్యక్రమాలు చేయాలని చెబుతారు, బ్రహ్మాండమైన సూచనలు ఇస్తారు, కానీ అప్పు మాత్రం చేయొద్దని అంటారు. సాధ్యమవుతుందా అని నేను అడుగుతున్నాను రామచంద్ర రావు గారు?

ఇవ్వాళ ప్రభుత్వ పాఠశాలలో చదివే పిల్లలు, హాస్టళ్లలో చదివే పిల్లలు, నైవాసిక పాఠశాలలో చదివే పిల్లలు వీళ్లంతా ఎవరూ? పేద పిల్లలు కాదా? ఆనాడు వారు ఎబివిపిలో తిరిగినప్పుడు హాస్టల్స్‌కు వచ్చారు తెల్ల పురుగుల దొడ్డు బువ్వ, రాళ్లు లేని బుక్క ఉండదు, ఆ బువ్వ కూడా కటోరంతో కొలిచి పెడతాడు, ఇంకా కొంచెం పెట్టమంటే నెత్తి మీద కొడతాడు. ఇదీ చరిత్ర. ముఖ్యమంత్రి గారికి ఒక్క మాట చెప్పినా. అన్నా, మనం ఈ పిలగాల్ల మీద దృష్టి పెట్టాలి. ఆ పిల్లలు జీవితంలో ఎదగలేక పోతే, ఆ కుటుంబాలు బాగుపడక పోతే, తెలంగాణ బాగు పడదని ఆరోజు ఒక మాట చెప్పడం జరిగింది. రామచంద్ర రావు గారూ, మన దేశంలో సన్నబియ్యం పెట్టి పేదలను ఆదుకున్న రాష్ట్రం ఏదైనా ఉన్నదా అని నేను అడుగుతున్నాను? రూ.650 కోట్లు ఖర్చు పెట్టి నైవాసిక పాఠశాలల్లో, హాస్టల్స్‌లో, ప్రభుత్వ పాఠశాలల్లో సన్న బియ్యం పెట్టిన ఏకైక రాష్ట్రం తెలంగాణ రాష్ట్రం కాదా అధ్యక్షా?

(గౌరవ సభ్యుల హర్షధ్వానాలు)

ఇది కనపడదా? దీనికి చరిత్ర కావాలా? దీనికి చదువు కోవాలా? ఎవరైన చెప్పాల్నా? వారు రోజు చూస్తున్న వ్యవస్థే కదా? విద్యుత్ విషయంలో వారు అన్నారు. విద్యుత్ విషయంలో ఎంత బాధ అవుతుందంటే, ప్రధానమంత్రి గారు ఈ రాష్ట్రానికి వచ్చినప్పుడు ఏక్ రూపాయికి బిజిలీ మిల్‌గయా, ఏక్ రోటీ మిల్‌గయా అని ఒక మాట అన్నారు. సంతోషపడ్డాం. కానీ, నిజంగా ఒక్క రూపాయికే దొరుకుతుందా? ఏదో మధ్యరాత్రి పూట ఎవరూ కరెంటును వాడుకోక పోతే దొరుకుతుందేమో కానీ, దొరుకుతుందా? నిజమే అనుకున్నాం.

రామచంద్రరావుగారూ, ఇవ్వాళ నేను అంటున్నాను. దేశంలోని 21 రాష్ట్రాలలో మీ ప్రభుత్వం ఉన్నది. మీరు ప్రజలకోసం ఉన్న ప్రభుత్వమని చెప్పుకుంటున్నారు. ఒక్క రూపాయికే యూనిట్ దొరుకుతుందని అంటున్నారు. దక్షిణాది మరియు ఉత్తరాది రాష్ట్రాల గ్రిడ్ లింక్ అయిందని మీరే చెబుతున్నారు. ఇది నిజమే అయితే, ఈ దేశంలో ఉన్న రైతాంగానికి 24 గంటల పవర్ ఇవ్వడానికి మీకున్న అభ్యంతరం ఏమిటి? రైతుల మీద ప్రేమ లేకనా, రైతులకు కరెంటు ఇస్తే బాగుపడతారనే భావన ఉందా? లేదు, ప్రతి పైసని మార్వాడిలా దుకాణాలలో కొలిచే పద్ధతా? ఒకసారి ఆలోచన చేయమని కోరుతున్నాను. ప్రభుత్వాలు మార్వాడి దుకాణాలు కావు. తల్లిదండ్రులు కొడుకు బాగుపడితే ఎంత గొప్పగా ఫీలవుతారో, ఈ దేశంలో ఉన్న ప్రజలు బాగుపడితే అంత గొప్పగా ప్రభుత్వం ఫీలు కావాలి. దేశానికి తండ్రి పాత్ర ప్రధానమంత్రి అయితే, తల్లి పాత్ర ప్రభుత్వం పోషిస్తుంది. రాష్ట్రానికి తండ్రి పాత్ర ముఖ్యమంత్రి అయితే, తల్లి పాత్ర ప్రభుత్వం పోషిస్తుంది. కానీ మీరు చెప్పేది ఒకటి, చేసేది ఒకటి. మాకు చెబుతున్నారు బాగానే ఉంది కానీ, మీరు ఏమి చేస్తున్నారు? కరెంటు ఎందుకు ఇవ్వలేక పోతున్నారు?

ఇవ్వాళ విద్యుత్ వినియోగం అనేది అభివృద్ధికి ఒక సూచిక అని చెబుతారు. 11,000 యూనిట్లు దేశంలో ఆవిరై ఉంటే, 15,000 యూనిట్లు వాడుకుంటున్న రాష్ట్రంగా ఇవ్వాళ మన రాష్ట్రం ఉన్నది. అధ్యక్షా, మొన్న ముఖ్యమంత్రి గారు మాట్లాడుతూ, 2014 సంవత్సరం కన్నా ముందు 8 మిలియన్ల ప్రజలు ఎరోప్లేన్‌లో ప్రయాణం చేస్తే, ప్రభుత్వం వచ్చిన తర్వాత 18 మిలియన్ల పైచిలుకు ప్రజలు ప్రయాణం చేస్తున్నారనే ఒక మాట చెప్పారు. నాలుగు సంవత్సరాల కాలంలో దాదాపు ఒక కోటి మంది ఎరోప్లేన్‌లలో ప్రయాణం చేయగలిగే సత్తా సంతరించుకుందంటే, మనది తిరోగమనమా? పురోగమనమా? అభివృద్ధినా? అభివృద్ధి కాదా అని చెప్పాలి. ఇట్లా చెప్పాలంటే ఒక వంద విషయాలు చెబుతాను. మా కర్నె ప్రభాకర్ గారు, అన్నా ఎంతసేపు చెబుతారని అంటే, మీ ఓపిక ఉన్నంత వరకు చెబుతానన్నాను. అర్థగంట కావచ్చు, మూడు గంటలు కావచ్చు.

దయచేసి మీరు ఇంకా వెనకటి లాగా ప్రశ్నించి, గుడ్డిగా, ద్వేషంతో మాట్లాడకూడదని నేను ఒక సూచన చేస్తున్నాను. నెగిటివ్ అంశాన్ని అర్థం చేసుకోవాలి తమ్మీ! గుండెల్లో పెట్టుకోవాలి, దానికి పరిష్కారం వెతకాలని ముఖ్యమంత్రి గారు చెబుతూ ఉంటారు. కానీ, దిక్కులేదు, దిక్కులేదు, గరీబోల్లం, గరీబోల్లం, మాకింత భిక్షం వేయమంటే, ఎవరూ వేయరని చెబుతారు. 'ఎవరో వస్తారని, ఏదో చేస్తారని, ఎదురు చూసి

మోసపోకుమా' అని శ్రీశ్రీ గారు చెప్పారో, మేము అదే పాలసీలో ఉన్నాం. కేంద్ర ప్రభుత్వం మీద ఆశ లేదు. ఎవరో పక్కవాడు వచ్చి, మనకు సాయం చేస్తారని ఆశ లేదు. మళ్లీ పడితే మనమే బాధ పడాలి, చేస్తే మనమే శ్రమ చేయాలి, నిర్మించుకుంటే, మనమే ఒక గొప్ప రాష్ట్రాన్ని నిర్మించుకోవాలి తప్ప, ఎవరో వచ్చి చేస్తారన్న విశ్వాసం లేని వాళ్లం.

ఇవ్వాళ మా ముఖ్యమంత్రి గారికి కమిట్‌మెంట్, పాజిటివ్ దృక్పథం ఉంది కాబట్టే తెలంగాణ రాష్ట్రాన్ని సాధించగలిగాం. అది గనుక లేకపోతే తెలంగాణ రాష్ట్రం వచ్చేది కాదు. ఏదో తట్ట, బుట్ట క్రింద పడేసి పోయే వాళ్లం. అనేక సందర్భాలలో మా నాయిని నర్సింహా రెడ్డి గారు మాట్లాడుతూ, ఏందే, వాళ్లకు లేనిది మనకెందుకని చెప్పడం జరిగింది. 2008వ సంవత్సరంలో ఒక దెబ్బ తగిలినప్పుడు, 2009వ సంవత్సరంలో మరొక దెబ్బ తగిలినప్పుడు, వాళ్లకు లేనిది మనకెందుకని మేము చర్చించుకున్నాం. ఇప్పుడే లౌక్యం అవసరముంటది, ఇప్పుడే కమిట్‌మెంట్ అవసరముంటది, ఇప్పుడే కరెక్ట్ నిర్ణయం అవసరముంటదని, కాంగ్రెస్ పార్టీ వాళ్లు సానుభూతి చెప్పినా కూడా మేమందరం ముందుకు వెళ్లి, అంతిమంగా విజయాన్ని ముద్దాడినం, గమ్యాన్ని ముద్దాడినం అధ్యక్షా.

పక్క రాష్ట్రం వాళ్లు మేం గరీబోల్లం, మాకింత భిక్షమెయ్యమని ఆశపడ్డారు. కాని మనం ఎక్కడికీ పోలేదు. గరీబోల్లమని చెప్పి, చిప్ప పట్టుకొని తిరిగిన వాళ్లు బాగుపడ్డరా? 'హమ్ కిసీసే కమ్ నహీ హై' అని గల్లా ఎగురవేసిన వాళ్లం. ఆత్మస్థైర్యం ఉండాలి, సాధిస్తామనే సంకల్ప బలం ఉండాలి, దానికి సంబంధించిన కార్యాచరణ, పని విధానం ఉండాలి. అవన్నీ సంతరించుకుంటున్న ప్రభుత్వమే మన తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం. మా భానుప్రసాద రావు గారు ఎక్కడి నుండి తెస్తారని ఒక మాట అన్నారు. తెస్తం, ఎక్కడనో పుడతయి. ధర్మం ఉంటది, న్యాయం ఉంటది, పనిచేసే వారిపట్ల సానుభూతి ఉంటది.

ఎంత అదృష్టమంటే అధ్యక్షా. అప్పుడు వరల్డ్ బ్యాంకు రూ.2,000 కోట్లు, రూ.3,000 కోట్లు లోను ఇవ్వాలంటే 36 నిబంధనలు ఉండేవి. గౌరవ ముఖ్యమంత్రి గారు మాట్లాడుతూ, 'యహ్ కండీషన్, గిండీషన్ నహీ చల్తా హై యహా పే' అని ఒక మాట అన్నారు. ఎవరైతే ఇస్తారో, వాళ్లని రమ్మని చెప్పారు. నిజంగానే వచ్చారు. రామచంద్ర రావుగారూ, బాధ కలిగించే ఒక విషయం చెబుతాను, మీరు మీ మోదీ గారికి, లేకపోతే మీ అమిత్‌షా గారికి చెప్పండి. మొన్న కూడా చెప్పాను, మళ్లీ చెబుతున్నాను. రూ.7 లక్షల 20 వేల కోట్లు ల్యాంకో లాంటి ప్రాజెక్టులు ఎగబెడతా ఉంటే, నీరవ్ మోడీలు, హర్షద్ మెహతాలు ఈ దేశాన్ని నాశనం చేస్తా ఉంటే, ఇవ్వాళ బ్యాంకులు వాళ్ల తాత జాగిర్లా, బ్యాంకులలో ఉన్న డబ్బంతా ప్రజల డబ్బు కాదా అధ్యక్షా. ప్రజలు తమ రక్తాన్ని చెమటగా మార్చి పైసా, పైసా అక్కడికి తీసుకొని పోయి కడుతున్నాం కదా!

రామచంద్రరావు గారూ, నేను ప్రజలతో సంబంధమున్న వ్యక్తిగా అడుగుతున్నాను. లక్ష రూపాయలు లోను తీసుకొని, కట్టకపోతే తలుపులు పీక్కొని పోతారు కదా, ఐదు లక్షల లోను ఇవ్వాలంటే, ఐదు లక్షల రూపాయల అసెట్ కుదవపెట్టాలి కదా. అలాంటి బ్యాంకులలో ఎవడి అబ్బ సొమ్మని ఇవ్వాళ లక్షల, కోట్ల రూపాయల లోను తీసుకున్నారు, ఎవడి అబ్బ సొమ్మని రూ.7 లక్షల 20 వేల కోట్లు ఎగబెడతా ఉంటే, బ్యాంకులు దివాలా తీస్తాయని, మీరు కడుతున్న డబ్బు ఎంతో తెలుసా?

పన్నుల రూపంలో ప్రజల నుంచి వసూలు చేసిన డబ్బుని, మీరు మిషన్ భగీరథ, మిషన్ కాకతీయకు ఇస్తలేరు, విద్యకోసం ఇస్తలేరు. మీరు ఇస్తున్నది. రూ.2.11 లక్షలను ఆ బ్యాంకులకు ఇచ్చి ఆ ఎగబెట్టిన దుర్మార్గుల యొక్క అప్పు కట్టే ప్రయత్నం చేస్తున్నారు. ఈ సంవత్సరం రూ.80,000 కోట్లు బాండు రూపంలో, రూ.8,000 కోట్లు ఖజానా నుండి ఈ సంవత్సరం ఇచ్చారు, మిగతా డబ్బు వచ్చే సంవత్సరంలో ఇవ్వబోతున్నారు. రిజర్వ్ బ్యాంకు ఆఫ్ ఇండియా చుట్టూ మేము పిల్లి కూనల్లా తిరిగాం. నేను కొత్తగా మంత్రి అయిన తర్వాత ఫైనాన్స్ సెక్రటరీలుగా ఉన్న మా రామకృష్ణా రావుగారు, నాగిరెడ్డి గారులతో కలిసి, రిజర్వ్ బ్యాంకు ఆఫ్ ఇండియా దగ్గరికి వెళ్లి, అయ్యా, 35 లక్షల రైతాంగానికి రుణ మాఫీకి సంబంధించిన అంశం ఇది, దీంట్లో మీరు పాటించవలసింది రూల్స్ కాదు, చట్టం కంటే భిన్నంగా మానవత్వాన్ని ప్రదర్శించమని కోరడం జరిగింది. అలా రిజర్వ్ బ్యాంకు ఆఫ్ ఇండియా దగ్గరికి పదిసార్లు వెళ్లినాం. పోతే మా నిబంధనలను మేము డీవియేట్ కాలేము, ఇది మీ హెడేక్ అని అన్నారు.

ఒక రాష్ట్రప్రభుత్వం రూ.17,000 కోట్ల రైతుల రుణాలను మాఫీ చేయబోతోంది, ఇది ప్రైవేటు లిమిటెడ్ కంపెనీ కాదని ప్రభుత్వం ఒకసారి మాట ఇస్తే, మాటకు కట్టుబడి ఉంటుందని పూచీకత్తు ఇచ్చినప్పటికీ కూడా మా రుణం మాఫీ చేయడంలో రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా ఒప్పుకోలేదు కదా. మరీ బ్యాంకులు రూ.7.20 లక్షల కోట్లు ఎగబెడతా ఉంటే, వాటిని

మీ ప్రభుత్వమే కడతా ఉంటే, ఏ రూల్స్, ఏ నార్మ్స్ ఒప్పు కున్నాయో చెప్పగలరా అని నేను అడుగుతున్నాను. మీ దగ్గర దీనికి సమాధానం ఉన్నదా? మీరు పన్నులు వసూలు చేసి చేస్తున్న పని అది, మేము పన్నులు వసూలు చేసి చేస్తున్న పని ఈ రాష్ట్రంలో 24 గంటల విద్యుత్‌ని అందించడం. 564 రెసిడెన్షియల్ స్కూల్స్‌లో సన్నబియ్యం, ఉచిత విద్యుత్ ఇటువంటివి యాభై చెబుతాను.

ఇప్పుడు రిలవెంటో కాదో చెప్పను గాని, ఆనాడు ప్రధానమంత్రి రాజీవ్ గాంధీ గారు మాట్లాడుతూ, దేశంలో రూపాయి విడుదలైతే 15 పైసలు మాత్రమే ప్రజలకు చెందుతాయి అని ఒక మాట చెప్పారు. ఇవ్వాళ నేను గర్వంగా చెప్పగలుగుతాను. రూ.35,000 కోట్ల సంక్షేమ పథకాలు ఈ రాష్ట్రంలో ఖర్చుపెడితే ఒక రూపాయి కూడా అటు ఇటు డీవియేట్ కాకుండా ప్రజలకు నేరుగా చేరే పథకాలు ఏమైనా ఉంటే ఈ దేశంలో తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ పథకాలే అని ఘంటాపథంగా చెప్పగలను.

తెలంగాణ ప్రభుత్వం వచ్చిన నాలుగు సంవత్సరాలలో వాళ్ల గుండెలలో ఉండేటటువంటి పది రకాల పథకాలను, ఇవ్వాళ మేము ప్రజలకు అందిస్తున్నాం. కొత్త ప్రభుత్వం, కొత్త రాష్ట్రం, ఒక చిన్న రాష్ట్రం. కేంద్ర ప్రభుత్వంలో, ఒక పదిహేను సంవత్సరాలు ఒక రాష్ట్రాన్ని పాలించిన ముఖ్యమంత్రి, ప్రధానమంత్రి గారు ఈ దేశ ప్రజానీకానికి ఒక పథకమైనా గుండెల్లో పెట్టుకునే పథకం ఇచ్చారా? అని నేను అడుగుతున్నాను. మీరు మమ్మల్ని విమర్శించినా, మొహమాటం లేకుండా మాట్లాడినా కూడా ఇది ధర్మమైద్దా? అని నేను అడుగుతున్నాను.

ఇవ్వాళ ఒక పార్టీ రాలేదు. నిజంగా వాళ్లకు మొహం లేదు. నేను బాజప్తా చెప్పగలుగుతున్నాను, ఆ పార్టీ ఇక్కడికి వచ్చి వాదించే సత్తా లేదు. జడ్జిగారు ఎప్పుడు తీర్పు ఇస్తారు అధ్యక్షా? ఇద్దరు అడ్వకేట్లు విషయాన్ని చెప్పినప్పుడు ఆ జడ్జిగారు వింటున్న సందర్భంలో ఎవరిది న్యాయమో, ఎవరిది అన్యాయమో తెలుస్తది, దానిని బట్టి తీర్పు ఇస్తారు. ఇవ్వాళ ఈ చట్ట సభలు ఆ ఆలోచన, ఈ ఆలోచన గురించి మాట్లాడుకునే గొప్ప ప్రజాస్వామ్య వేదిక. దానికి జడ్జీలు ప్రజలు. ఎవరు చెప్పిన దాంట్లో నిజముందో, ఎవరు చెప్పిన దాంట్లో అబద్ధముందో వారు నిర్ణయించుకుంటారు. రేపు వాళ్ల గుండెలు ఆవిష్కరించి తీర్పు ఇస్తారు. వాళ్లు రాజకీయ పార్టీలకి ఐదేళ్లకొకసారి తీర్పు ఇస్తారు. కానీ, మీరు ఇంత ఖర్చు పెట్టారు, ఇంత ఖర్చవుతుందా అని పాడిందే పాడారు. 2014-15 సంవత్సరంలో 62 శాతం, 2015-16 సంవత్సరంలో 85 శాతం, 2016-17 సంవత్సరంలో 93 శాతం అయితే ఈ 2017-2018 సంవత్సరంలో 95 శాతం ఖర్చు గావించబడిందని ఈ సందర్భంగా తెలియజేస్తున్నాను.

రూపంలేని దగ్గర నుండి మొదలు పెట్టి ఈనాడు రూపాన్ని ఆవిష్కరించిన ప్రభుత్వం తెలంగాణ ప్రభుత్వం. ఇవ్వాళ ఆ మొహాలు ఇక్కడికి వచ్చి తట్టుకునే శక్తి లేదు కాబట్టే, ఈరోజు ప్రజలలో తిరుగుతూ ఎవరి మీద పడితే వారి మీదనే విమర్శించే ప్రయత్నం చేస్తున్నారు. ఎంత నీచమైన విమర్శ అంటే మొన్న నా నియోజ వర్గానికి వచ్చి, వేల కోట్ల రూపాయలు సంపాదించుకున్నారని ఆరోపణ చేశారు. వేల కోట్లు పక్కన పెట్టు, ఆ కోట్ల మాటే తెలుస్త లేదు అని చెప్పాను.

రాజకీయాలలో కర్కశత్వం ఉండొచ్చు, రాజకీయాలకు కుట్రలు, కుతంత్రలు ఉండొచ్చు. నేనైతే రాజకీయాన్ని కుట్రలు, కుతంత్రాల నిలయంగా భావించను. రాజకీయమనేది ప్రజల అవసరాల కోసం, ప్రజల సమస్యల పరిష్కారం ఇచ్చేటటువంటి గొప్ప సైన్స్‌గా నేను భావిస్తాను. రాజకీయం డబ్బు సంపాదన కోసమో, కుట్రలు, కుతంత్రాల కోసమో, పర్సనల్ ఎజెండా కోసమో ఉన్నట్లుగా నేను భావించడం లేదు. రాజకీయం ప్రజల కన్నీళ్లకు పరిష్కారం చూపేటటువంటి ఒక సోషల్ సైన్స్‌గా నేను భావిస్తాను. కానీ ఇవ్వాళ వారు ఎట్లా పడితే, అట్లా మాట్లాడుతున్నారు. మనం మనుషులం, మృగాలం కాదు. ఒక్కసారి గాయపడితే అది మానదని తెలిసిన జ్ఞానం ఉన్నప్పటికీ కూడా ఎవరి మీద మాట్లాడుతున్నారో తెలియకుండా, ఇవ్వాళ మాట్లాడేటటువంటి నీచ సంస్కృతికి ఒడిగట్టారు. అందుకనే అలాంటి సంస్కార హీనమైన పార్టీలకు తప్పకుండా నాలాంటోళ్లు శిక్ష వేయక పోవచ్చు, ప్రజా క్షేత్రంలో అధర్మం, అన్యాయానికి ప్రజలు తప్పకుండా శిక్ష వేస్తారు.

కాంగ్రెస్ పార్టీ 2014 సంవత్సరంలో పాతివేయబడింది. తెలంగాణ రాష్ట్రంలో మీరు ఎన్ని రకాల మోసపు మాటలు చెప్పినప్పటికీ, ఎన్ని రకాలు ప్రచారాలు చేసి గాయపరిచే ప్రయత్నం చేసినప్పటికీ కూడా ప్రజలు విశ్వసించే స్థాయిలో లేరు. ప్రజలే వాళ్లకు గోరీ కట్టారు. అలాగే ఉంటుందని నేను భావిస్తున్నాను. ఈ వేదిక ద్వారా నేను తెలంగాణ యావత్తు ప్రజానీకానికి విజ్ఞప్తి చేయదలచుకున్నాను. మేము 15 సంవత్సరాల కాలంపాటు ప్రజల కళ్లల్లో కదలాడినోళ్లం, ప్రజల కాళ్లల్లో తిరిగినోళ్లం. ఆనాడు 14 సంవత్సరాల చరిత్రలో ఎక్కడ

ఎవరు టెంటు వేసినా కూడా, ఎక్కడ ఎవరు మా సమస్య ఉందని గర్జించినా, ఆ గొంతుకలో గొంతుక అయిన వాళ్లం, ఆ సమస్య పరిష్కారం కోసం కొట్లాడినోల్లం మేము.

**5.40 సా.** ఆనాడు 14 సంవత్సరాల చరిత్రలో ఏ హోంగార్డు జీతాలు పెరగాలని భావించామో, ఏ అంగన్ వాడీ జీతాలు పెరగాలని భావించామో, ఏ రైతాంగం మీద కేసులు పెట్టవద్దని భావించామో, రైతాంగానికి మంచి ఎరువులను అందించాలని వారితో పాల్గొన్నామో ఆ సమస్యలను పరిష్కరించాలనే కమిట్‌మెంట్, ఆ తపన ఉన్నవాళ్లం. ఆనాడు వేలెత్తి చూపించారు. ఈనాడు వాళ్లు వేలెత్తి చూపించకూడదని కోరుకుంటున్నాం. అంతకంటే ఎక్కువ మేము కోరుకోవడం లేదు కాబట్టి, ఈనాడు ఇలాంటి పార్టీల మోసపు మాటలు నమ్మి ఇలాంటి రాజకీయ నాయకుల దుర్మార్గపు విష ప్రచారాలను నమ్మవద్దని కోరుతున్నాను. ఆనాడు కూడా ఇలాంటి విష ప్రచారాలను ప్రక్కకు నెట్టి వాటిని పాతరేసి మమ్మల్ని ఆదుకున్నారు. మమ్మల్ని గెలిపించారు. మంత్రులు అంటే 24 గంటలు పనిచేసే వారు ఎవరన్నా ఉంటారా? ప్రాజెక్టులలో, టన్నెలలో ఉంటారా? శ్రీ టి. హరీష్ రావుగారు 24 గంటలు ప్రాజెక్టుల దగ్గర పనులు చేయిస్తున్నారు. మేము మంత్రులుగా భావించడం లేదు. మంత్రులమనే గర్వం మాకు లేదు. మేము కార్యకర్తలుగా భావిస్తున్నాము. ప్రజలు గొప్ప అవకాశం ఇచ్చారు. ఆ అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని వారి రుణం తీర్చుకునే ఉద్దేశ్యంతో మేము ఉన్నాము కాబట్టి, తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వమనేది ప్రజల హృదయాలను దోచుకోవాలని చెప్పి, ప్రజల హృదయాల్లో స్థానం సంపాదించుకోవాలని చెప్పి, దేశ చిత్ర పటం మీద తెలంగాణ రాష్ట్రాన్ని గొప్ప రాష్ట్రంగా చూడాలనే కల తప్ప మాకింకొక కల లేదు. దానికి మమ్మల్ని ఆశీర్వదించండి. ముఖ్యమంత్రిగారికి అండగా ఉండాలని చెప్పి, ఈ ప్రభుత్వానికి అండగా ఉండాలని చెప్పి మేము కోరుకుంటున్నాము తప్ప దానికి ఇంకొక ప్రతిఫలం లేదని మనవి చేస్తూ, ఈనాడు తెలంగాణ ప్రజానీకానికి తప్పకుండా గుండెల్లో పెట్టుకొని కాపాడుకోవాలని కోరుకుంటూ అప్రొప్రియేషన్ బిల్లును ఆమోదించాల్సిందిగా కోరుతున్నాను.

جناب سید امین الحسن جعفری (Janab Syed Aminul Hasan Jafri): یہاں پر جو discussion ہوا تھا صاحب جو بجٹ پر' اس پر میں یہ demand بھی کیا تھا کہ سدھیر کمیشن کی جو دوسری رپورٹ ہے اس کو ٹیبل کرنا چاہئے' کیوں کے سدھیر کمیشن کی جو دوسری رپورٹ ہے اس میں انہوں 30 انہیں 29 State plus Delhi میں Backward classes of our Muslims کو جو Reservation مل رہے ہیں وہ اس کے بارے وہ جو تفصیلات دیئے ہیں اگر آپ اس رپورٹ کو ٹیبل کریں تو یہ پتہ چلے گا کہ آپ کے جو 22 بی جے پی ruled کی جو ریاستیں ہیں اس میں 16 ریاستوں میں آپ کو مسلم Backward section of Muslims ہیں Reservation دیئے جا رہے ہیں اور اس سے ہٹ کر جو دیگر 7 ریاستیں ہیں ان ریاستوں میں Reservation دیئے جا رہے ہیں اور یہ Reservation دو قسم کے ہیں صاحب State Reservation میں بھی دیئے جا رہے ہیں اس سے ہٹ کر جو Central Reservation ہے اس میں بھی کئی مسلم گروپس اور مسلم کاسٹس ہیں۔ اگر آپ یہ رپورٹ ٹیبل کریں تو پتہ چلے گا کہ ریاستوں میں کتنے percentage کا Reservation دیا جا رہا ہے۔ ایک اور بات یہ ہے صاحب کہ' میں یہ request کرنا چاہتا ہوں کہ TRS حکومت سنٹرل حکومت پر زیادہ سے زیادہ دباؤ ڈالیں کہ 12% Reservation مسلم اقلیت کیلئے جو بل لایا گیا اور اس کے علاوہ STs Reservation کے Reservation 10% کا جو بل لایا گیا۔ یہ دونوں کے Reservation کو مسلم اقلیت ریزرویشن کو بڑھانے کا اور STs Reservation کو 6% سے 10% کرنے کا ان دونوں کو روک دیا ہے۔ اس کو مسلم Reservation نہیں بول رہے ہیں اس کو Muslim backward Reservation کہہ رہے ہیں۔ تو آپ یہاں پر STs کو بھی finalist کر رہے ہیں۔ اگر وہ بل دونوں کیلئے common بل کے بطور لیا گیا تو آپ STs کو بھی جو Reservation additional 4% ملنا ہے اس کو بی جے پی کی Central Government روکتی ہے تو آپ pressure کر کے ان دونوں کیلئے بل لانے کیلئے دباؤ ڈالیں۔ Presidential assent یا clearance یا جو بھی ہے آپ اس کیلئے کوشش کریں۔ شکریہ

**శ్రీ ఎన్. రామచంద్రరావు:-** అధ్యక్షా, ఎక్కువ క్లారిఫికేషన్స్ లేవు. ఆర్థిక శాఖ మంత్రిగారు మాట్లాడుతూ బ్యాంకుల రుణాల గురించి మాట్లాడారు. నీరవ్ మోదీ గురించి మాట్లాడారు. నేను దాని మీద డిబేట్ చేయదలుచుకోలేదు. ఆ రుణాలన్ని కూడా కాంగ్రెస్ పార్టీ అధికారంలో ఉన్నప్పుడు ఇచ్చిన రుణాలు. బీజేపి ప్రభుత్వ హయాంలో ఇచ్చిన రుణాలు కాదు.

**శ్రీ ఈటల రాజేందర్:-** అధ్యక్షా, సభ్యులు శ్రీ ఎన్. రామచంద్రరావుగారు చెప్పిన దానిని తప్పు పట్టడం లేదు. హర్షద్ మోహతాలు, నీరవ్ మోదీ, ల్యాంకో ఇండ్రస్టీస్, విజయ్ మాల్యాలు పుట్టగొడుగుల్లాగా పుట్టుకొస్తున్న వ్యక్తులు, సంస్థలకు మీ ప్రభుత్వమైనా అట్లాంటి ఒరవడికి స్వస్తి పలుకుతుందా లేదా అని మీరు చర్చించుకోండి. పేదవాడికి లక్ష రూపాయలు ఇవ్వాలంటే చేతులు రావడం లేదు. ఆనాడు కాంగ్రెస్ ప్రభుత్వం చేసిందా? లేదా ఎన్‌డిఏ ప్రభుత్వం చేసిందా? అనే విషయాలను ప్రక్కకు పెడితే చట్టం ఉన్నవాడి చుట్టమైనదని పేదవారు అనుకుంటున్నాడు. డా.బి.ఆర్.అంబేద్కర్ గారు మాములు కూలీ పనులు చేసుకునేవాడికైనా, ఉన్నత వర్గానికి చెందిన వారికైనా ఒక్కటే చట్టమని అన్నారు. అటువంటి చట్టం ఈనాడు పరిహాసమైనదని మా బాధ. బ్యాంకుల వారు సామాన్య మానవుడిని మెట్లు కూడా ఎక్కనివ్వరు. కేంద్ర ప్రభుత్వం కూడా సెక్యూరిటీ లేకుండా కోటి రూపాయల షూరిటీ ఉండాలనే నిబంధన పెట్టారు. అది అమలవుతుందా? అధ్యక్షా. మీకు తెలుసు, మాకు తెలుసు. కోటి రూపాయల రుణం

తీసుకోవాలంటే కోటి రూపాయల విలువ గల అర్బన్ ప్రాపర్టీ పెడితే తప్ప లోన్ రాదు. మరి ల్యాంకో వారికి రూ. 50,000 కోట్లు ఎట్లా ఇచ్చారు? నీరవ్ మోదీకి ఏ విధంగా ఇచ్చారు? అందుకే నేను బ్యాంకర్స్ మీటింగ్స్‌లో ఏం చెబుతానంటే టైలు, బూట్లు, కోటు వేసుకున్న వాడి గురించి మాట్లాడవద్దు. చెమట వాసన వచ్చే వాడి గురించి మాట్లాడమని చెబుతాను. నాగిరెడ్డిగారు, రామకృష్ణారావుగారు, శివ శంకర్ గారు మొదటి సెక్రటరీలుగా ఉన్నప్పుడు ఏమిటి సార్, మన చాంబర్‌కు వేల మంది వస్తున్నారు? అని నన్ను అడిగారు. నేను ఏమన్నానంటే మా ప్రభుత్వానికి, మా శాఖకు ఈ చెమట వాసన వచ్చే వాళ్లే చుట్టమని చెప్పాను. ఈరోజు నేను అడుగుతున్నాను రామ చంద్రరావుగారూ, పెద్ద పెద్ద కంపెనీలకు లోన్స్ ఇచ్చేటప్పుడు ఎవరు సపోర్టు చేస్తారు? దాని డైరెక్టర్లు, సభ్యులు, బాసులు మొదలగువారు చూస్తారు. వీరందరూ ఎవరి కంట్రోల్‌లో ఉంటారు? మీకు తెలియదా?మీ Finance Departmentలో కంట్రోల్ ఉండదా? రాష్ట్రానికి సంబంధించి ఉంటుందా? దాని పరిధి ఎంత? రాష్ట్రం ఒక లక్ష రూపాయలు అప్పు తెచ్చుకోగలుగుతారా? ఒక్క మాట చెప్పండి దేశానికి ఉండే వెసులుబాటు రాష్ట్రాలకు పది శాతమైనా ఉంటుందా? ఈ దేశంలో ఉన్న అన్ని రాష్ట్రాలకు సమాన హక్కులు అంటున్నారు ఇది నిజమా? చెప్పండి రామ చంద్రరావుగారూ. 0.5 శాతం FRBM నుండి లోన్ తెచ్చుకోవడానికి మేము పడ్డ నరకం అంతా, ఇంతా కాదు. అది అంతా మా రామకృష్ణారావుగారికి తెలుసు. FRBM రుణం కోసం మేము ఆనాడు రెవెన్యూ సర్‌ప్లస్ స్టేట్‌గా చూపించాము. మేము కట్టే వడ్డీలు రెవెన్యూ బిల్స్‌లో 10 శాతం లోపే అని చూపించాము. అవన్నీ ఉంటే తప్ప లోన్ ఇవ్వలేదు. ఈనాడు ఫ్రీగా ఏం ఇవ్వడం లేదు. అందుకే నేను ఒక మాట అన్నాను. అమ్మ పెట్టదు, అడుక్కు తిననివ్వదు అని.

جعفری صاحب اس ملک میں reservation پر جو عمل ہو رہا ہے وہ مذہب کی بنیاد پر نہیں بلکہ طبقات کی بنیاد پر ہو رہا ہے ۔ آج کل مسلم مائناریٹیز میں جو طبقات ہیں میں سمجھتا ہوں کہ وہ 30 سے زائد ہیں۔ مسلمانوں میں جو ذیلی طبقات ہیں اس لیے ہمارے سی ایم صاحب نے بتایا کہ اس ملک کی ایک ایک ریاست کو ایک ایک رول نہیں ہو سکتا جو rule تاملناڈو میں رہے گا وہی رول ہمارے لیے بھی ہو۔ اسی کے لئے ہم لڑ رہے ہیں۔ صحیح تو یہ ہے کہ آبادی کے لحاظ SC/STs کا جو reservation ہے وہ دستور کے تحت ہے۔ ہمارے سی ایم صاحب نے کہا کہ اس ملک میں انصاف کے دو طریقے نہیں ہو سکتے۔ ماہرین قانون سے رائے مشورہ کر کے ہم اس مسئلہ کو آگے لیجانے کی کوشش کر رہے ہیں۔

L.A.Bill No.7 of 2018:

MR. CHAIRMAN:- The question is:

"That the Telangana Appropriation Bill, 2018 be taken into consideration"

(Pause)

The Motion was adopted and the Bill was considered.

**CLAUSE 2 & 3, SCHEDULE, CLAUSE 1, ENACTING FORMULA AND SHORT TITLE**

MR. CHAIRMAN:- The question is:

"That the Clause 2 & 3, Schedule, Clause 1, Enacting Formula and Short Title do stand part of the Bill"

(Pause)

The Motion was adopted and the Clause 2 & 3, Schedule, Clause 1, Enacting Formula and Short Title were added to the Bill.

SRI EATALA RAJENDER (MINISTER FOR FINANCE):- I beg to move:

"That the Telangana Appropriation Bill, 2018 be passed"

CHAIRMAN:- Motion moved. The question is:

"That the Telangana Appropriation Bill, 2018 be passed"

(Pause)

The Motion was adopted and the Bill was passed.

L.A.Bill No.8 of 2018:

MR. CHAIRMAN:- The question is:

"That Telangana Appropriation (No.2) Bill, 2018 be taken into consideration".

(Pause)

The Motion was adopted and the Bill was considered.

**CLAUSES 2 & 3, SCHEDULE, CLAUSE 1, ENACTING FORMULA AND SHORT TITLE**

MR. CHAIRMAN:- The question is:

"That the Clause 2 & 3, Schedule, Clause 1, Enacting Formula and Short Title do stand part of the Bill".

(Pause)

The Motion was adopted and the Clause 2 & 3, Schedule, Clause 1, Enacting Formula and Long Title were added to the Bill.